ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

7

ఆదివారం 30 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సెహరీ (సోమవారం ఉదయం)
రాయచోటి	6.31	4.52
మదనపల్లె	6.33	5.00
రాజంపేట	6.29	4.58
పీలేరు	6.31	4.51

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన పార్టీ టీడీపీ

- టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



కేక్ కట్ చేసి పార్టీ సీనియర్ నాయకుడికి తినిపిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43 ఏళ్లలో అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయంతో తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం కమ్మపల్లెలో గల ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 43 సంవత్సరాలు రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి దేశ, రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగు ప్రజల గౌరవం కోసం ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. ఎన్టీ రామారావు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వం వరకు టీడీపీ ఎన్నో మైలురాళ్లు దాటుకుంటూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలకే కాకుండా తెలుగు ప్రజలందరికీ ఎనలేని గౌరవం కల్పించిందన్నారు. అనంతరం మంత్రి టీడీపీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాయచోటి మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, మహిళా నేత సుజాత, టీడీపీ నేతలు సుగవాసి విద్యాధర్, ఆంజనేయులునాయుడు, మల్లికార్జుననాయుడు, దిగువ అబ్బవరం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతి కోసం పుట్టిందే టీడీపీ

- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



రాజంపేటలో టీడీపీ జెండా ఎగురవేసిన పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి ఆత్మ గౌరవం కోసం, బడుగుల అభ్యున్నతి కోసం 43 ఏళ్ల కింద స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శనివారం రాజంపేట ఎన్టీఆర్ సర్కిల్, పార్లమెంట్ కార్యాలయాల్లో టీడీపీ ఆవిర్భావ వేడుకలను చమర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవమే నినాదంగా ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో టీడీపీ తిరిగి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధిపరంగాను, సంక్షేమ పరంగాను ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, కాకతీయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శివనారాయణచౌదరి, కూచివారిపల్లె మాజీ సర్పంచ్ అమ్మినేని అజయ్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకులు వెంకటయ్యనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డయ్యనాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు రామనరసింహులు, బాపనయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచడమే
లక్ష్యం..

- హంద్రీ-నీవాతో 1.50 లక్షల ఎకరాలకు అదనంగా నీళ్లు
- మామిడి రైతుకు వంద శాతం ఆదాయం పెంపు
- రాబోయే పదేళ్లలో జీడీపీలో జిల్లా 16వ స్థానం
- అభివృద్ధితో మారనున్న జిల్లా రూపురేఖలు
- ఆంధ్రజ్యోతితో కలెక్టర్ చామకూరి శ్రీధర్

జిల్లాలో వ్యవసాయంతో పాటు పండ్ల తోటల సాగూ ఎక్కువే. కాబట్టి రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని వర్గాల రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. జిల్లాలో హంద్రీ-నీవా ప్రాజెక్టు కాలువల ద్వారా ఇప్పుడున్న దానికి అదనంగా మరో 1.50 లక్షల ఎకరాలు సాగులోకి తెస్తాం. మామిడి సాగు రైతు ఆదాయం వంద శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నాం. రాబోయే పది సంవత్సరాలలో జీడీపీలో జిల్లా 16వ స్థానానికి ఎగబాకుతుంది. దీంతో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగి జిల్లా రూపురేఖలే మారిపోనున్నాయి. ఈ మేరకు ఇటీవల విజయవాడలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి దృష్టికి నివేదికలు సమర్పించినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. జిల్లా అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తీసుకోబోతున్న చర్యలపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పలు అంశాల గురించి వివరించారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రసుత్తం జిల్లాలో లక్షా 20 వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. ప్రస్తుతం సాగులో ఉన్న మామిడిలో కొంత నాణ్యమైన కాయలు దిగుబడి రావడం లేదు. ఈ మేరకే ధరలు పలుకుతున్నాయి. అయితే కాయల నాణ్యత, రుచి, రంగు పెంచేందుకు.. కాయలకు కవర్లు తొడిగితే చాలా ఉపయోగంగా ఉంటుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం చొరవ వల్ల మామిడి రైతులకు కవర్లు పంపిణీ చేస్తున్నాం. ఈ కవర్లు వినియోగించడం వల్ల మామిడి కాయకు ఎటువంటి మచ్చలు, పురుగులు ఉండవు. కాయ సైజు గతం కంటే పెరుగుతుంది. కవర్లు చుట్టని కాయలు కిలో రూ.30 వరకు ఉంటే.. కవర్లు చుట్టిన కాయలకు రూ.70 నుంచి 80 ఉంటుంది. గత ఏడాది జిల్లాలో 500 మెట్రిక్ టన్నుల మామిడి ఎగుమతి జరిగింది. ఈ ఏడాది దానిని 1000 మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లాలో 1700 హెక్టార్లలో అన్ని నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ కవర్లు పంపిణీ చేస్తున్నాం. ఒక కవర్‌కు అయ్యే ఖర్చు రూ.2.10 పైసలు. ప్రభుత్వం ఒక రూపాయి భరిస్తుంది. రైతు రూ.1.10 చెల్లించాలి. హెక్టార్‌కు పది వేల కవర్లు ఇస్తున్నాం. వీటిని పదివేల కాయలకు వినియోగించవచ్చు. పదివేల కాయలంటే సుమారు మూడువేల కిలోల కాయలు తూకం వస్తాయి. వీటిని మార్కెట్‌లో రూ.40 కాకుండా 30 రూపాయల లెక్కన అమ్మినా రూ.90 వేలు అదనంగా మామిడి రైతుకు లాభం వస్తుంది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాను. దీంతో ముఖ్యమంత్రి ఈ కవర్ విధానం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 60 వేల ఎకరాల్లో రైతులందరికీ కవర్లు ఇద్దామన్నారు. అయితే అందులో కేవలం 10 శాతం ఇచ్చినా సరిపోతుందని నేను ముఖ్యమంత్రికి వివరించాను.

ఇర్రేడియేషన్ సెంటర్ కోరాం

సాధారణంగా విదేశాలకు పండ్లు ఎగుమతి కావాలంటే ఆ పండ్లలో ఎటువంటి హానికరమైన అవశేషాలు లేకుండా ఉండాలి. ఇర్రేడియేషన్ కేంద్రం ద్వారా పండ్లు, కూరగాయల్లో హానికర అవశేషాలను లేకుండా చేయవచ్చు. ప్రస్తుతం బెంగళూరు సమీపంలోని మాలూరు దగ్గర ఈ కేంద్రం ఉంది. ఇటువంటి సెంటర్‌ను మన జిల్లాకు అడిగాము.



కలెక్టర్ చామకూరి శ్రీధర్

జిల్లా రూపురేఖలు మారిపోతాయి

హెచ్ఎన్ఎస్ఎస్-2 పథకం గురించి ముఖ్యమంత్రికి క్షుణ్ణంగా తెలుసు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్, సత్యసాయి జిల్లా జీడిపల్లె రిజర్వాయర్ లైనింగ్ పనులకు రూ.910 కోట్లు మంజూరు చేశారు. అక్కడ ప్రస్తుతం లైనింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలో శ్రీనివాసపురం రిజర్వాయర్, అడవిపల్లె రిజర్వాయర్‌కు హంద్రీ-నీవా కాలువను కలుపుతారు. అడవిపల్లె రిజర్వాయర్‌లో 1.8 టీఎంసీలు, శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో 1.04 టీఎంసీలు వస్తాయి. ఈ రెండింటినీ నింపుకుంటే వీటి ద్వారా 28 వేల ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ కింద 24 వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. ఇది మొత్తం 50 వేల ఎకరాలు అవుతుంది. ఇది కాకుండా హంద్రీనీవా కాలువ ఇక్కడి నుంచి చిత్తూరుకు వెళుతుంది. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి 300 కిలోమీటర్లు మన జిల్లా నుంచి వంద కిలోమీటర్లు. దీనికయ్యే ఖర్చు రూ.107 కోట్లు. ప్రధాన కాలువ అడవిపల్లె రావడానికి అయ్యే ఖర్చు రూ.297 కోట్లు. ఇలా సుమారు రూ.400 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. దీనివల్ల మనకు సుమారు 70 వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. ఇవే కాకుండా ఇంకో మూడు వందల కోట్ల వరకు ఖర్చు చేసి సబ్‌కెనాల్స్, బ్రాంచ్ కెనాల్స్‌కు లైనింగ్ చేస్తే.. రైతు పొలం వరకు నీళ్లు వెళ్తాయి. వీటన్నింటికీ కలిపితే జిల్లాలో 1.50 లక్షల ఎకరాలు సాగులోకి అదనంగా వస్తాయి. ప్రస్తుతం జిల్లాలో కేవలం 3 లక్షల ఎకరాల్లో మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న భూమిలో 18 శాతం మాత్రమే సాగు చేస్తున్నారు. ఇంకా 30 శాతానికి పైగా వ్యవసాయానికి వీలుగా ఉంది. 1.50 లక్షల ఎకరాలు సాగులోకి వస్తే.. సుమారు 50 శాతం అదనంగా సాగులోకి వస్తుంది. 1.50లక్షల ఎకరాలు సాగులోకి వస్తే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు ప్రాంతాల్లో హార్టికల్చర్ పెరుగుతుంది. దీనివల్ల ప్రజల ఆదాయం రెట్టింపు అవుతుంది. లైనింగ్ పూర్తయితే నీళ్లు చివరి ఆయకట్టుకు అందుతాయి. రూ.700 కోట్లు ఈ ప్రాజెక్టు మీద ఖర్చు చేస్తే ఏడాదికి 9 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిమీద ముఖ్యమంత్రికి అవగాహన ఉంది. దీంతోనే ఏటా ఐదు వందల కోట్లు ఇస్తానన్నారు. ప్రస్తుతం మన జిల్లా జీడీపీలో 23వ ర్యాంకులో ఉంది. అత్యంత పేద జిల్లా మనది. 26 జిల్లాల్లో 23వ స్థానంలో ఉన్నాం. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 1.50 ఎకరాలు అదనంగా సాగులోకి తేగలిగితే రాబోయే పదేళ్లలో 16వ ర్యాంకుకు చేరుకుంటాం. దీనివల్ల ఈ ప్రాంతం నుంచి విదేశాలకు వలసలు నిలిచిపోతాయి.

ఏపీఐఐసీ పార్కుకు ప్రతిపాదనలు

కురబలకోటలో ఏపీఐఐసీ పార్కుకు ప్రతిపాదనలు పంపించాము. ఈ ఇండ్రస్ట్రియల్ పార్కు ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో 700 ఎకరాలలో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాము. జిల్లాలో 13 మండలాల్లో మూడువేల కోట్ల ఖర్చుతో వాటర్ ప్రాజెక్టును అడిగాము. కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ కింద ఏర్పాటు చేయవచ్చు. ఇప్పటికే ఫేజ్-1 ఉంది. మనం ఫేజ్-2 అడుగుతున్నాం. అన్నమయ్య ప్రాజెక్టు గురించి అడిగాము.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

కొత్త జిల్లాలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రజల నుంచి 100 ఫిర్యాదులు వస్తే అందులో 90 భూసమస్యల మీద వస్తున్నాయి. ఇప్పుడున్న సిబ్బందికి వీటిని పరిష్కరించే సమయం సరిపోవడం లేదు. రెవెన్యూ సిబ్బంది తగినంత మంది లేరు. తగినంత మంది లేక 15 మండలాల్లో పూర్తి అదనపు బాధ్యతల కింద డిప్యూటీ తహసీల్దార్లనే పెట్టాము. కలెక్టరేట్‌లో నలుగురు తహసీల్దార్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంటు పోస్టులు కూడా చాలా ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటినీ ముఖ్యమంత్రికి తెలియజేశాము.

సబ్సిడీతో సూక్ష్మపోషక, మిశ్రమ ఎరువులు

2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వం రైతుల కోసం సూక్ష్మ పోషక, మిశ్రమ ఎరువులను సబ్సిడీతో ఇచ్చేవాళ్లు. వేరుశనగకు జిప్సం, వరికి జింక్‌సల్ఫేట్ ఇచ్చేవాళ్లు. పండ్ల తోటలకు వేర్వేరు పోషక ఎరువులు ఇచ్చేవాళ్లు. దీనివల్ల పంట దిగుబడి కనీసం 20 శాతం పెరిగేది. రైతుకు ఎంతో ఉపయోగకరంగా ఉండి.. ఆదాయం పెరిగేది. ఇప్పుడు మళ్లీ ఇవి ఇస్తే ఎంతో ఉపయోగం.. ప్రభుత్వం అన్నదాత పథకం కింద రూ.20 వేలు ఇస్తా అంటోంది. దీనిని వేరుగా ఇస్తుందా.. కలిపి ఇస్తుందా ప్రభుత్వ నిర్ణయం. ఈ సమస్యను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాము.

ఈకేవైసీ గడువు పొడిగింపు

- ఏప్రిల్ 30 వరకు అవకాశం

మదనపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులోని సభ్యులకు ఈకేవైసీ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 31వ తేదీ వరకు ఉన్న గడువును మరో నెల రోజులు పెంచుతూ ఫుడ్, సివిల్‌సప్లయ్ శాఖ జాయింట్ డైరెక్టర్ జయ్‌పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఈ అవకాశాన్ని కార్డుదారులకు తెలియజేయాలని అందులో సూచించారు. అయిదేళ్లు దాటిన వారంతా ఈకేవైసీ చేసుకోవాలని, అప్పటికీ బయోమెట్రిక్ పడకపోతే, ఆధార్ సెంటర్‌కు వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, బయటి ప్రాంతంలో ఉంటూ పెండింగ్ జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ గడువులోగా ఈకేవైసీ చేసుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేశారు.

బ్యాంకులకు 3 రోజుల సెలవులు

- యథావిధిగా పనిచేయనున్న సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు

కలికిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆదివారం నుంచి అన్ని బ్యాంకులకు మూడు రోజుల పాటు వరుసగా సెలవులున్నాయి. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్, మంగళవారం వార్షిక లావాదేవీల ముగింపు రోజు కావడంతో బ్యాంకుల్లో ఎలాంటి ఆర్థిక లావాదేవీలకు వీలుండదు. బ్యాంకుల వరుస సెలవుల కారణంగా మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీకి ఆటంకం లేకుండా శనివారం అవసరమైన మొత్తాలను ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేసింది. ఆ వెంటనే పింఛన్ల పంపిణీ అధికారులు బ్యాంకుల నుంచి అవసరమైన నగదు డ్రా చేసి పంపిణీకి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. ఆది, సోమవారాల్లో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు పూర్తి స్థాయిలో పనిచేయాలని గతంలోనే ప్రభుత్వం ఆదేశాలు చేసింది.

సంవత్సరాంతంలో అవసరమైన వారికి రిజిస్ట్రేషన్ల విషయంలో ఇబ్బందులు లేకుండా పని చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేగాకుండా ఈ రెండు వరుస సెలవు దినాల్లో జిల్లా, రాష్ట్ర రిజిస్ట్రారు కార్యాలయాలు కూడా యథావిధిగా పనిచేయనున్నాయి. మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లను సెలవు రోజుల్లో కూడా కొనసాగించనున్నాయి.

రసాభాసగా...
కౌన్సిల్ సమావేశం

- అభివృద్ధి జరగలేదని ఆందోళన
- నిధుల కేటాయింపుపై నిరసన
- పోడియం ముందు బైఠాయింపు
- కౌన్సిలర్ల వాకౌట్..అజెండా రద్దు



చైర్‌పర్సన్ మనూజతో వాగ్వాదానికి దిగిన వైసీపీ కౌన్సిలర్లు

మదనపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్వపక్షంలోనే విపక్షమైన వైసీపీ కౌన్సిలర్లు ఆందోళనతో మున్సిపల్ సమావేశం రసాభాసగా మారింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం ప్రారంభం కాగా అనంతరం అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. తమ వార్డుల్లో అభివృద్ధి జరగలేదని, నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. మా పార్టీ చైర్‌పర్సనే తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని మరో కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వార్డుల్లో ఎక్కువ నిధులు కేటాయిస్తున్నారని, మరి కొన్ని వార్డులపై వివక్ష చూపుతున్నారని వాపోయారు. ఇందులోభాగంగా ఇప్పటి అజెండాలో రూ.4.87 కోట్లకు అభివృద్ధి పనులు పెట్టగా, అందులో కేవలం తొమ్మిది వార్డులకే పెట్టారని ఉదాహరణగా చూపించారు. అధికారులను నిలదీస్తే బ్లాక్‌మెయిల్ చేసే వారికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించిన కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. అజెండా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రొటోకాల్ పాటించడం లేదని, గత సమావేశంలో ప్రస్తావించినా స్పందన లేదన్నారు. అనంతరం ఎక్స్ అఫిషియో హోదాలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రవేశించగా కౌన్సిలర్లు ఎస్.కరీముల్లా, మార్పూరి నాగార్జునబాబు, పెరవలి రాజేష్‌లు వార్డుల్లో నిధుల కేటాయింపుపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కమిషనర్ కె.ప్రమీలను ఆదేశించారు.



చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు

అనంతరం మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు వార్డుల్లో తమకు సమాచారం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని గత సమావేశంలో ఆందోళన చేసి అధికారులను నిలదీసినా స్పందన లేదని వైస్‌చైర్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఒక విధంగా, బయట మరోవిధంగా ప్రవర్తిస్తున్నారని, తమకు విలువలేనప్పుడు మేం కూడా అజెండా అంశాలను ఆమోదించమని తేల్చి చెప్పారు. చివరకు అజెండాను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి వైసీపీ కౌన్సిలర్లంతా బయటకు వెళ్లిపోవడంతో సమావేశం ముగిసినట్లయింది. అంతకు ముందు సమావేశం ప్రారంభం కాగానే, 6వ వార్డు కౌన్సిలర్ జి.ప్రసాద్‌బాబు వార్డులోని సమస్యలను ఏకరువు పెట్టారు. మూడున్నరేళ్లలో రూ.16 లక్షల మేర ఖర్చు చేశారని, అది కూడా ఎస్సీ, ఎస్టీ నిధులతో పాటు 14వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నట్లు పేర్కొన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులు కేటాయింపులో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అయిన వారికి ఓ విధంగా, కాని వారికి మరోవిధంగా వ్యవహరిస్తున్నారని మరో కౌన్సిలర్ పెరవలి రాజేష్ ఆక్షేపించారు. పట్టణంలో ప్రజల నుంచి పన్నులు ముక్కుపిండి వసూలు చేశారని, కానీ అక్కడ ఆ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టలేదని కౌన్సిలర్లు ఎస్.కరీముల్లా, మందపల్లె వెంకటరమణ, మార్పూరి నాగార్జునబాబు వాపోయారు. మూడున్నరేళ్లలో అనుకున్న స్థాయిలో వార్డుల్లో అభివృద్ధి పనులు చేయలేదని వాపోయారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాలేదని, అప్పటికీ తాము వెంటబడి వారిచేత పనులు చేయిస్తున్నట్లు కమిషనర్ కె.ప్రమీల పేర్కొన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో సీఎఫ్ఎంఎస్ నుంచి రిలాక్స్ కానుందని, దీంతో పట్టణంలో అభివృద్ధికి ఢోకా లేదని ఎమ్మెల్యే ప్రకటించారు. అంతలోపు వార్డులవారీగా ప్రాధాన్యత ప్రకారం పనులు గుర్తించాలని ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. త్వరలోనే కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అధిగమిస్తామని చైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్ ప్రకటించడంతో ఆందోళన, అభ్యంతరాలకు తెరపడింది.

రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న రేషన్ కార్డుదారులు ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రేషన్‌కార్డుల్లోని మొత్తం 14,82,094 సభ్యుల్లో 13,31,491 సభ్యులు ఇది వరకే ఈకేవైసీ పూర్తి చేసుకుని ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం రేషన్‌కార్డు ఏటా నవీకరణలో భాగంగా రేషన్‌కార్డుల్లోని సభ్యులెవరైనా ఇంకా ఈకేవైసీ చేయించుకోకుంటే మీ సమీప డీలర్ వద్ద లేదా, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వద్ద (లేదా) మొబైల్ రేషన్ వాహనం ఆపరేటర్ వద్ద ఈ ప్రక్రియ ఏప్రిల్ నెలలోపు చేయించుకోవాలని తెలిపారు. అలా చేయకపోతే కార్డుదారులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఈకేవైసీ నమోదు రాష్ట్రంలో ఎక్కడైనా చేయించుకోవచ్చునన్నారు. ఈకేవైసీ నమోదు కాని వారి జాబితా సంబంధిత ప్రాంత చౌకధరల దుకాణపు డీలరు, గ్రామ, రెవెన్యూ అధికారి వద్ద ఉంటుందని, వారిని సంప్రదించి ఈ-పాసు యంత్రంలో వేలిముద్ర వేయాలన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఈకేవైసీ అవసరం లేదని, ఈకేవైసీ చేసుకునేందుకు ఎవరికీ డబ్బులు చెల్లించనవసరం లేదని జేసీ తెలిపారు.

పండగల సందడి

8



- కిటకిటలాడిన మార్కెట్లు.. వస్త్ర దుకాణాలు

పండగల సందడి

- కిటకిటలాడిన మార్కెట్లు.. వస్త్ర దుకాణాలు
- పూలంగళ్ల వద్ద జనం రద్దీ ● ఎటు చూసినా ట్రాఫిక్ జాం



పూలు, మామిడి ఆకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పీలేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో శనివారం సాయంత్రం పండుగల సందడి నెలకొంది. అటు తెలుగు సంవత్సరాది ఉగాది, ఇటు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందడికి కారణమైంది. పండుగల కోసం నిత్యావసర సరుకులు, పూజాసామాగ్రి, కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు శనివారం సాయంత్రం ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం కిటకిటలాడింది. పూల అంగళ్లు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. పూజా సామాగ్రి అంగళ్ల వద్ద రద్దీ నెలకొంది. ఉగాది సందర్భంగా తమ పూర్వీకులకు బట్టలు పెట్టుకునే సంప్రదాయం ఉండడంతో బయటి ప్రాంతాల్లో ఉన్న చాలామంది తమ సొంతూర్లకు పయనం కావడంతో ఆర్టీసీ బస్టాండు ప్రయాణీకులతో కిటకిటలాడింది. అంతేకాకుండా రంజాన్ పండుగ కోసం ముస్లింలు సైతం పెద్దఎత్తున కొనుగోళ్ల కోసం బయటకు రావడంతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి.





పీలేరులో పండ్లు, దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్ పూలమార్కెట్‌లో రద్దీగా జనం

మదనపల్లెలో...

ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా మదనపల్లె పట్టణంలో జనం కిక్కిరిసిపోయారు. శనివారం సాయంత్రం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో పూల అంగళ్ల వద్ద జనం రద్దీగా కనిపించారు మదనపల్లె పట్టణం, రూరల్ ప్రాంతాల నుంచి జనం ఎక్కువగా పట్టణంలోకి పండగ సామాగ్రి కోనుగోలు చేయడానికి రావడంతో మార్కెట్లు, రోడ్లు రద్దీగా మారిపోయాయి. వాహనాలు ఎక్కువగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ జామ్ అయి వాహనాలు రోడ్డుపై బారులు తీరాయి. మల్లికార్జున సర్కిల్ నుంచి టౌన్ బ్యాంకు సర్కిల్ వరకు ట్రాఫిక్ జామ్ అయింది.

జిల్లాలో తాగునీటి సమస్య ఉండకూడదు

- 1వ తేదీ పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఉండకూడదని, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, 1వ తేదీ పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ సిబ్బంది, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య కనిపించకూడదని, దానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియాకు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎన్జీవోలు, దాతలతో సమన్వయం చేసుకొని ప్రజలందరికీ చలివేంద్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి పింఛన్ల పంపిణీ జరగాలని ఆదేశించారు. పల్లె పండుగ పనులపై సమీక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ సిబ్బందిని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ ద్వారా వచ్చే అర్జీలను నాణ్యతతో, అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీలో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని మండలాల్లో ఎన్టీఆర్ హౌసింగ్‌లో స్టేజీ కన్వర్షన్ అవ్వాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ ఆధారితమైన మన జిల్లాలో 100 రూపాయల్లో 21 రూపాయల ఆదాయం ఉద్యానవనశాఖ నుంచి మరో 21 రూపాయల ఆదాయం పశుపోషణ ద్వారా వస్తుందని కేవలం ఐదు శాతం మాత్రమే వ్యవసాయం మీద ఆదాయం వస్తోందని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనను వినియోగించుకోవాలి

ఏప్రిల్, మే, జూన్ నెలల గ్రామీణ ఉపాధి కల్పన ప్రణాళికలోని పంచ ప్రాధాన్యాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా ప్రజలకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో డ్వామా పీడీ వెంకటరత్నంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్, మే, జూన్ నెలల ఉపాధి కల్పన ప్రణాళికలోని పంచ ప్రాధాన్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల అభివృద్ధిలో భాగంగా అతి ముఖ్యమైన ఐదు అంశాలైన పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం, సేద్యపు నీటి కుంటల నిర్మాణం, పంట కాలువల్లో పూడిక తీయడం, సాగునీటిల చెరువుల్లో పూడికతీత, సగటు వేతనం రోజుకు కనీసం రూ.300 ఉండేలా చూడడం అనే ఐదు అంశాలు లక్ష్యంగా ఏప్రిల్, మే, జూన్ నెలల ఉపాధి కల్పన ప్రణాళికను రూపొందించామన్నారు. జిల్లా ప్రజలందరూ ఈ పంచ ప్రాధాన్యాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు.

కారు దహనం కేసులో నిందితుడు అరెస్టు

రామసముద్రం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో సంచలనం కలిగించి ఉద్రిక్తతకు దారి తీసింది మండల టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడుకు చెందిన ఇన్నోవా కారు దహనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. రామసముద్రం పంచాయతీ గుంతల పేట గ్రామానికి చెందిన నూలు శ్రీనివాసులు కారు దహనానికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫైళ్ల దహనం కేసులో సీఐడీ విచారణ



రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేస్తున్న సీఐడీ అధికారులు

వాల్మీకిపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసుకు సంబంధించి శనివారం వాల్మీకిపురం కార్యాలయంలో సీఐడీ విచారణ చేపట్టింది. రైతులతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం విషయమై మండలంలోని 26 మంది రైతులకు చెందిన ఫైళ్లు దహనం కావడం, తదితర విషయాలపై సీఐడీ అధికారులు ఆరా తీశారు. రైతులు స్వయంగా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారా అక్కడ ఎవరితోనైనా మాట్లాడారా తదితర విషయాలను నేరుగా రైతులతో చర్చించారు. అలాగే పలు వివరాలను రైతుల నుంచి రికార్డు చేశారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్ఐ మంజుల, వీఆర్వో స్వర్ణలత, రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

నాటుసారా, మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) మండలంలో నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో సీటీఎం దళితవాడలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మస్తాన్ భార్య ఎర్రబల్లి బుజ్జి (42), వెంకటరమణ కుమారుడు పి.లక్ష్మీనారాయణ వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే చీకిలబైలు గ్రామంలో జె.శ్రీనివాసులు భార్య జె.నాగమ్మ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఆమె వద్ద 31 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అలాగే మొదటి ఇద్దరు నిందితులకు నాటుసారా సరఫరా చేసిన మేకలవాండ్లపల్లెకు చెందిన మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు డోర్కాస్, జబీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ కుటుంబానికి ఆర్థికసాయం



రామకృష్ణ కుటుంబానికి నగదు అందిస్తున్న ఎన్ఆర్ఐ లోకేశ్

మదనపల్లె టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం కృష్ణాపురంలో వైసీపీ నాయకుడి చేతిలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబానికి మదనపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ లోకేశ్ కొణిదల ఆర్థికసాయం చేశారు. శనివారం రాత్రి కృష్ణాపురానికి వెళ్లిన ఎన్ఆర్ఐ లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి నిలిచిన ప్రతి ఒక్కరికి పార్టీ అధిష్ఠానం అండగా ఉంటుందన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తన వంతు రామకృష్ణ కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థికసాయం అందించానన్నారు. కార్యక్రమంలో పెరవలి నవీన్, రాజేష్, నిరంజన్‌నాని, మార్పూరి రమేశ్, వంశీనరసింహ, గగన్‌సాయి, మహేష్, రామకృష్ణ కుమారులు పాల్గొన్నారు.

పండుగలను సంతోషంగా జరుపుకోవాలి

రాజంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, దేవాలయాల వద్ద, మసీదుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో శనివారం ఉదయం స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. వేకువజామునే ఆలయ అధికారులు పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలను అర్చకులకు అందజేశారు. ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు మనోజ్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఆదినారాయణ కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ



హెడ్‌కానిస్టేబుల్ సతీమణికి నగదు అందజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆదినారాయణ ఈనెల మొదటి వారంలో పీలేరులోని ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ మృతి పట్ల ఎస్పీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల వాల్మీకిపురం ఎస్ఐ చంద్రశేఖర్, సహోద్యోగులు చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల మండలం మంగళంపేట బలిజపల్లెలోని హెడ్ కానిస్టేబుల్ స్వగృహంలో ఉన్న ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు దహన సంస్కారాలకు లక్ష నగదును ఆయన సతీమణికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు



గాయపడిన ఇరగంరెడ్డి

రామాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం నీలకంఠ్రావుపేట గ్రామం శివాలయం వద్ద శనివారం బైక్ అదుపు తప్పి ఆవుల ఇరగంరెడ్డి మరో బాలికకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... గాలివీడు మండలం నూలివీడుకు చెందిన ఆవుల ఎర్రగంరెడ్డి మరో బాలిక కడపలో చదువుతున్నారు. సెలవుల కారణంగా వారిరువురు బైక్‌పై ఇంటికి వస్తుండగా శివాలయం వద్దకు రాగానే ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగింది. వేగంగా వస్తున్న బైక్‌ను అదుపు చేయలేక బస్సును వెనుక వైపు నుంచి ఢీకొనడంతో ఇరువురు గాయపడ్డారు. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీరభద్రాలయంలో అమావాస్య పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య కృష్ణయ్య స్వాములు భద్రకాళీ అమ్మవారు వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగించారు.

చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం





ప్రత్యేక వెండి అలంకరణలో చౌడేశ్వరీదేవి, ఊరేగింపుగా దివ్వెలను తీసుకెళుతున్న మహిళలు

మదనపల్లె అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉగాది, చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే గణపతి, చౌడేశ్వరిదేవి, సుబ్రహ్మణ్యం స్వాములకు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మదనపల్లె పట్టణంలోని, నీరుగట్టువారిపల్లె పురవీధుల నుంచి మున్నెప్పకాలనీ, కనక దాస్ నగర్, అయోధ్యనగర్, కాట్లాటపల్లె రోడ్డు, రామిరెడ్డి లేవుట్, చంద్రాకాలనీ, అనప గుట్ట నుంచి కూడా మహిళలు భక్తి శ్రద్ధలతో దీలు బోనాలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు.

అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని చౌడేశ్వరీదేవిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, సెక్రటరీ బండి పవన్ కుమార్, ట్రెజరర్ రత్నమయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండి నాగరాజ, రామిశెట్టి నీలకంఠ, రామిశెట్టి ఆంజనేయులు, శీలం రమేష్ బాబు, వెంకటేశ్, సిద్దప్ప, పాల్గొన్నారు.

చోరీ యత్నం విఫలం ... ఒకరిపై దాడి

నందలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నీలిపల్లె గ్రామంలో శనివారం వేకువజామున సనవర్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి ప్రయత్నించారు. ఏఎస్ఐ ఐ.మోసెస్ వివరాల మేరకు... బడేరాత్ సందర్భంగా పాటూరుకు వెళ్లిన ఆ ఇంటిలోని యువకులు షేక్ సల్మాన్, షేక్ షబ్బీర్‌బాషాలు ఇంటివద్దకు వచ్చి చూడగా గేటు తెరచి ఉండడం గమనించారు. అలికిడి విన్న దొంగలు పారిపోయే ప్రయత్నంలో షేక్ సల్మాన్‌పై ఇనుపరాడ్‌తో దాడి చేశారు. దొంగలు వేసుకొచ్చిన బైకుతో పాటు దాడి చేసిన రాడ్, చెప్పులను అక్కడే వదిలి వెళ్లారు. ఈ సంఘటనపై యువకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని బైకు, ఇనుపరాడ్, చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

పేకాట నిర్వహణ ఆరోపణలతో కానిస్టేబుల్ సస్పెన్షన్

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలతో కానిస్టేబుల్ రామాంజులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామాంజులు కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా రాయచోటి మండల పరిధిలో పలు ప్రాంతాల్లో పేకాట నిర్వహణ విషయంలో బయట ప్రాంత వ్యక్తులకు ఆశ్రయం కల్పించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసిన సమయంలో పట్టుబడిన వారిలో కానిస్టేబుల్ కూడా ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పేకాట నిర్వహణ విషయంలో కానిస్టేబుల్ పాత్రపై విచారణ చేపట్టి రామాంజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

బాలుడిపై లైంగిక దాడి కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సంబేపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలుడుపై తిరుపతి రమేశ్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన సంఘటనలో నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.... రమేశ్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. 28వ తేదీ బాలుడు ఇంటి ముందు సైకిల్ తొక్కుకుంటున్న సమయంలో బాలుడిని అపహరించి అతనిపై లైంగిక దాడికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు తిరుపతి రమేశ్‌ను అరెస్టు చేసి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

వేలం ద్వారా రూ.10 లక్షల ఆదాయం

పెద్దమండ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలంలో వారపు సంతల నిర్వహణకు శనివారం నిర్వహించిన వేలం ద్వారా రెండు గ్రామ పంచాయతీలకు రూ.10.12 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, శేషాద్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దమండ్యం వారపు సంత నిర్వహణకు విశ్వనాధ రూ.6.40 లక్షలు అత్యధికంగా వేలం పాట పాడగా, బస్టాండ్ గేట్ వసూలుకు రఫీ రూ.78 వేలకు, తురకపల్లి వారపు సంతకు ఉమర్ రూ.2.34 లక్షలు, పసలబండ గేటు వసూలుకు వెంకటరమణ రూ.60 వేలు వేలం ద్వారా దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

మందుబాబుల అడ్డా పెద్దచెరువు



కోడూరు పెద్ద చెరువు గట్టుపై పగలు, రాత్రి మద్యం తాగుతున్న మందుబాబులు

రైల్వేకోడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కోడూరు పెద్ద చెరువు అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ప్రతిరోజూ సాయంత్రం కాగానే చెరువు వద్దకు మందుబాబులు చేరుకుని మద్యం తాగుతూ చిందులేస్తున్నారు. కోడూరు పెద్ద చెరువు దగ్గర గుండాలపల్లె, పాటిమీదిపాళెం, బయనపల్లె, అగ్రహారం, రెడ్డివారిపల్లె తదితర ప్రాంతాలకు సమీపంలో ఉంది. ఆటోలు, మోటారు బైకుల్లో వస్తున్న మందుబాబులు ఇక్కడ ఆగి మద్యం తాగుతున్నారు. ఇక్కడ ఓ ప్రైవేటు స్కూలు ఉంది. స్టడీ అవర్ చూసుకుని విద్యార్థులు ఆయా గ్రామాలకు రాత్రి 7 గంటలకు వెళుతుంటారు. ఆకతాయిలు, మందు బాబులు ఇక్కడ హల్‌చల్ చేస్తుంటారు. దీంతో ఇటు విద్యార్థులు, అటు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 10 గంటల వరకు మందుబాబులు ఉంటున్నారు. తాగి చిందులు వేయడంతో పాటు బూతు పురాణాలు చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా పెద్దచెరువు మద్యం తాగుతున్నారు. పోలీసులు ఇక్కడ నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాథమిక విద్యలో సమూల మార్పులు

- నాణ్యమైన విద్యే లక్ష్యం
- క్రీడలకు ప్రాధాన్యత

కూటమి సర్కారు కసరత్తు



కడప ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మారుస్తామని.. నాణ్యమైన విద్యనందిస్తామని ప్రకటించింది. కానీ ఆచరణలో విఫలమైంది. ఉపాధ్యాయులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్బందులకు గురయ్యారు. వాటన్నింటికీ చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు.

క్రీడల్లోనూ రాణించేలా...

గత ప్రభుత్వ హయాంలో పెద్ద గుదిబండగా ఉపాధ్యాయ లోకం భావించిన 117 జీవోను రద్దు చేయడంతో ఆ వర్గాలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. గత ప్రభుత్వం 3,4,5 తరగతులను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేయడంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. నూతన ప్రభుత్వ హయాంలో విలీనం ప్రక్రియను వెనక్కి తీసుకోవడంతో ప్రాథమిక విద్యారంగం మళ్లీ ఊపిరి పోసుకుంటోందన్న భావన బలపడుతుంది. విద్యతో పాటు విద్యాయేతర రంగాల్లో క్రీడలు, ఇతర అంశాల్లో రాణించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పక్కాగా ప్రణాళికలు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి గతంలో మాదిరిగా ఎక్కడి పాఠశాలలు అక్కడే అన్నట్లుగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలలను తెరిచిన వెంటనే కొన్ని రోజుల పాటు రెడీనెస్ విధానాన్ని అమలు చేయను న్నారు. కనీస అభ్యసనా సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఈ నూతన విధానాన్ని అమలు చేయ నున్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో 45 మంది విద్యార్థులు కలిగి న పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా పరిగణించి అక్కడ జాతీయ నూతన విద్యావిధానానికి అనుగుణంగా ప్రణాళికలను అమలు చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలలను కనీసం 20 మంది విద్యా ర్థులతో నిర్వహిస్తారు.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం



వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు రానున్నాయి. మోడల్‌స్కూలు వ్యవస్థ వస్తుంది. ఉపా ధ్యాయులు లేని తరగతులు, పాఠ శాలలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటా రు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

\- షంషుద్దీన్, డీఈవో

తరగతికి ఒక టీచర్

ఇక మీదట ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు. యూపీ స్కూళ్ల వ్యవస్థకు పూర్తిగా మంగళం పలుకుతారు. ఒకవేళ నడపాల్సి వస్తే స్కూలు అసిస్టెంటు లేకుండా ముగ్గురు ఎస్‌జీ టీలతో వీటిని నిర్వహిస్తారు. మిగిలిన స్కూళ్ల న్నింటి నీ విద్యార్థుల సంఖ్య ఆధారంగా హైస్కూళ్లుగా అప్ గ్రేడ్ చేస్తారు. విద్యాహక్కు చట్టం కింద ప్రతి విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున పది నెలల పాటు రవాణా ఖర్చులు చెల్లిస్తారు.

లీప్ పాఠశాలలు

నియోజకవర్గానికి ఒకటి చొప్పున 5 అంశాల ప్రాధాన్యంగా లీప్ పాఠశాలలను ప్రవేశపెట్టనున్నారు. ప్రతి పౌరునికి సమాన సమ్మిళిత విద్యను అందించడం, లింగ నిష్పత్తిని పెంచడం, దివ్యాంగులకు సదుపాయాలు కల్పించడం, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి కోసం నైపుణ్యాలను పెంపొందించడం, పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలను పెంచడం వంటివి అమలు చేస్తారు. నాలెడ్జి ఎకనామీ, సృజన, పరిశోధన వంటివి పెంచడం, ప్రపంచ ప్రమాణాలతో కూడిన పాఠ్య ప్రణాళికను అమలు చేయనున్నారు. సర్కారు బడుల్లో ప్రవేశాలకు పోటీ పడే విధంగా రాబోయే రోజులు ఉంటాయని మంత్రి లోకేశ్ చెబుతున్నారు.

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రావు

చెన్నూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లలోపు బాలికలు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రావు, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీనబాబు పేర్కొన్నారు. మండలంలోని చిన్న మాచుపల్లె, రామనపల్లె ఉన్నత పాఠశాలలో శనివారం పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి బాలికలకు రక్షణ కల్పించేందుకు 2012 సంవత్సరంలో ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చిందని.. ఇది వారికి రక్షణ కవచంగా ఉంటుందన్నారు. ఈ చట్టం ప్రకారం లైంగిక నేరాలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు విధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు గంగిరెడ్డి, సునీత, హెచ్‌ఎంలు అరుణకుమారి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో విలువైన ఆయుధం



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న వైస్‌చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జ్ఞానంతో పాటు శారీరక, మానసిక వికాసంతో ఆత్మస్థైర్యం గల యువత తయారవుతారని వైస్‌చా న్సలర్ ప్రొఫెసరు అల్లం శ్రీనివాసరావు అన్నారు. శనివారం వైవీయూ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో రెండో విడత తైక్వాండో శిక్షణ తరగతుల ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో శారీరక, వ్యాయామం అలవాటుగా మార్చుకుంటే నిత్యం ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కళాశాల ప్రిన్సి పాల్ హాస్టళ్ల చీఫ్ వార్డెన్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫె సరు పద్మ మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణకు, ఆత్మవిశ్వాసానికి ఆయుధమని అన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫి కెట్లు అందించారు.

గండి అంజన్నను దర్శించుకున్న జడ్పీ చైర్మన్



స్వామి వారికి పూజలు చేయించి హారతి అందుకుంటున్న జడ్పీ చైర్మన్

చక్రాయపేట/ వేంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామిని జిల్లాపరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కేసరి, రాజారమేశ్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం జడ్పీచైర్మన్ తన కుటుంబ సభ్యులు, ఇతర నాయకులతో కలిసి ఇడుపులపాయ వైఎస్ ఆర్ ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య, చక్రాయపేట ఎంపీపీ మాధవీ, ఏపీ ఆగ్రోస్ మాజీ అధ్యక్షుడు చెన్న క్రిష్ణారెడ్డి, జడ్పీటీసీలు బయపురెడ్డి, సుమిత్ర రాజశేఖర్‌రెడ్డి, వీరపు నాయునిపల్లె ఎంపీపీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలులో ఆకస్మిక తనిఖీ

పులివెందుల టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పులివెందుల సబ్ జైలును జిల్లా సివిల్ జడ్జి షేక్ బాబా ఫకృద్ధీన్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌జైలులో మౌలిక వసతులు పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత సాయం, లీగల్, డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసేవను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పులివెందుల బార్ అసోసియేషన్ న్యాయవాధులు కిశోర్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ అయ్యవారురెడ్డి పాల్గొన్నారు.

'తిరుమల క్షేత్రంపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం'

కడప, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అత్యంత పవిత్రమైన తిరుమలలో బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయించడం తిరుమల పవిత్రతకు భంగం కలిగించినట్లేనని తెలుగునాడు ప్రజాసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వైసీపీ రాష్ట్ర నాయకుడు సత్యసాయినాథ్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమలాపురంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమల క్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం విక్రయాలు జరగడం.. పోలీసులు దాడి చేసి శనివారం మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడం గమనిస్తుంటే తిరుమల పవిత్రతపై కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంభించినట్లు అర్థమవుతోందన్నారు.

రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారానికి జింకా సుబ్రమణ్యం ఎంపిక



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసే రాష్ట్రస్థాయి 2025 ఉగాది పురస్కారానికి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం ఎంపికయ్యారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా ఆయన సాహితీరంగంలో విశేష కృషి చేస్తున్నారు. వందల సంఖ్యలో సాహితీ సభలు నిర్వహించారు. ప్రముఖులు నిర్వహించిన అవధానాలలో పృచ్ఛకులుగా వ్యవహరించారు. ఆకాశవాణిలో వందకుపైగా కవితలు, ప్రసంగాలు, సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో పుట్టపర్తి నారాయణాచార్యులు, తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటుకు, తెలుగు మహాసభల నిర్వహణకు కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల పలువురుసాహితీమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

గానుగపెంట హనుమంతరావుకు...



బద్వేలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బద్వేలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, విద్వాన్ గానుగపెంట హనుమంతరావుకు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ఉగాది పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు సాంస్కృతిక శాఖ నుంచి శనివారం ఫోన్ ద్వారా ఆహ్వానించారు. ముప్పైఆరున్నర సంవత్సరాలు తెలుగు పండితులుగా పనిచేసి మాతృభాషాభివృద్ధికి కృషి చేశారు. 2005లో పదవీ విరమణ చేసిన ఆయన రాష్ట్రపతిచే పండితరత్న సాహిత్య అవార్డు, జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ పురస్కారం అందజేయడం పట్ల ఆయన మిత్రులు, శిష్యులు హర్షం వ్యక్తం చేశారు.

వేంపల్లె షరీఫ్‌కు...



వేంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కథా రచయిత, సాహితీ అకాడమీ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ ఉగాది పురస్కా రానికి ఎంపికయ్యారు. ఆదివారం ఉగాది పర్వదిన సందర్భంగా తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోనున్నట్లు అవార్డుకు ఎంపికైన షరీఫ్ తెలిపారు. ఈ ఉత్సాహంతో కొత్త కథా రచనలను రచిస్తామని ఆయన తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సుంకేసుల శ్రీనివాసులు (ఫైల్)

రైల్వేకోడూరు రూరల్, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అనంత రాజుపేట పంచాయతీ తూర్పుపల్లి అరుంధ తీవాడకు చెందిన సుంకేసుల శ్రీనివాసులు అప్పుల బాధతో విషద్రావణం తాగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు... శ్రీనివాసులుకు ఒక ఎకరా పొలం ఉంది. అందులోనే వ్యవసాయం చేసు కుం టూ జీవనం సాగిస్తున్నాడు.

వ్యవసాయం కలిసి రాకపోవడంతో సుమారు రూ.10 లక్షల మేర అప్పుల చేశాడు. అప్పుల సమస్యతో ఇంట్లో తరచుగా గొడవలు జరగడంతో మన స్థాపం చెంది శుక్రవారం విషద్రావణం తాగా డు. కుటుంబ సభ్యులు కోడూరు ప్రభుత్వా సుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసు పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శని వారం మృతి చెందాడు. మృతుడుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు.

యువకుడు అదృశ్యం



మైలవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మైలవరానికి చెందిన గద్దే గురుప్రసాద్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. మైలవరంకు చెందిన గురుప్రసాద్ తాౖరివేముల సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా ఈనెల 27వ తేదీ రాత్రి 11 గంటలకు ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా కనిపించకపోవడంతో అతని భార్య మానస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొండను తవ్వి ఎలుకను పట్టారు

- రూ.11 కోట్ల పనులకు రూ.ఒక లక్ష అవినీతి జరిగినట్లు నిర్ధారణ
- నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లపై వేటు
- సామాజిక తనిఖీలో లోపించిన పారదర్శకత



గాలివీడులో సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

గాలివీడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం 2023-24 సంవత్సరానికి 17 పంచాయతీల్లో జరిగిన రూ.11 కోట్ల పనుల్లో రూ.1,03,633 అవినీతి జరిగినట్లుగా అధికారులు నిర్ధారించి.. నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసి అవినీతి సొమ్మును రికవరీకి ఆదేశించారు. అయితే సామాజిక తనిఖీ బృందం శ్రమించి తయారు చేసిన నివేదికల్లో డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపించిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో జవహర్‌బాబు అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ నివేదిక బహిరంగ సమావేశానికి జిల్లా ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం, ఏపీడీ లోకేశ్వర్‌రెడ్డిలు హాజరయ్యారు. సమావేశంలో ఎస్‌ఆర్‌పీ సుబ్బారావు, ఎస్టీయం లోకేశ్వర్‌రెడ్డి తమ నివేదికలను చదివి వినిపించారు. అందులో భాగంగా పేరంపల్లి రూ.3008, గోపనపల్లె రూ.544, తూముకుంట రూ.4261, ఎగువగొట్టివీడు రూ.1710, గుండ్లచెరువు, రూ.14,003, కొర్లకుంట రూ.6094, నూలివీడు రూ.10,004, పూలుకుంట రూ.298, వెలిగల్లు రూ.11,592, గాలివీడు రూ.12,236, గరుగుపల్లి రూ.3604, పందికుంట రూ.10,518, తలముడిపి రూ.4409, అరవీడు రూ.8614, బోరెడ్డిగారిపల్లె రూ.2948, సీసీపల్లి రూ.5825, గోరాన్‌చెరువు రూ.10,165 గ్రామాల్లో అవినీతి జరిగినట్లుగా నిర్ధారించి రికవరీకి ఆదేశించారు. ఈ గణాంకాలను పరిశీలించిన అనంతరం బహిరంగ సభలో ఉన్న ప్రజలు, అధికారులు విస్తుపోయారు. మొత్తం ఈ నివేదిక ద్వారా ఎలాంటి అవినీతికి తావులేదన్నట్లు.. పాదర్శకంగా పనులు జరిగాయని సామాజిక తనిఖీ బృందం కితాబివ్వడం పలు విమర్శలకు తావిస్తోంది. మార్చి 14 నుంచి 27వ తేదీ వరకు జరిగిన ఆడిట్‌లో సామాజిక తనిఖీ బృందం తూతూ మంత్రంగా తనిఖీ నిర్వహించి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు అందాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నివేదికలు మరింత బలం చేకూరుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చిన ఉన్నతాధికారులు నలుగురు టెక్నికల్ అసిస్టెంట్ల బాలాజీ, మల్లికార్జున, పురుషోత్తంరెడ్డి, ఖాదర్‌బాషానుపై సస్పెండ్ చేశారు తప్ప అవినీతి లెక్కలు తేల్చడంలో తనిఖీ బృందం విఫలమయ్యిందన్న విషయం బహిర్గతమయ్యిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సమావేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు.

అన్నమయ్య సంకీర్తనలు

రాజంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంగీత సభ, హరికథ భక్తులను ఆకట్టుకుంది. తాళపాక అన్నమయ్య విగ్రహం వద్ద కళాకారులు ఉదయ్‌భాస్కర్ రెడ్డి, ఎ.నాగలక్ష్మి బృందం సంగీత సభ నిర్వహించారు.

మంత్రిని కలిసిన డీఆర్‌వో

రాయచోటి (కలెక్టరేట్), మార్చి29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఇన్‌చార్జి తహసీల్దార్ నరసింహకుమార్, పర్యాటక శాఖ ఏడీ నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి భూ సమస్యల గురించి డీఆర్‌వోను, ఇన్‌చార్జి తహసీల్దార్లతో చర్చించారు.

టీడీపీతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

● అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం ● టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో ప్రముఖులు




చిట్వేలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేకే చౌదరి... రైల్వేకోడూరు: ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో...

రాజంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం అని టీడీపీ నేతలు పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావంతో తెలుగు జాతికి నవోదయం వచ్చిందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మాజీ మండలాధ్యక్షుడు పొందూరు కొండయ్యనాయుడు, పాల్గొన్నారు.



రాజంపేట: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం వర్గీయులు

కార్యకర్తలే టీడీపీకి పునాదులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి పునాదులని రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. పార్టీ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాగవరంలోని తన స్వగ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

కార్యకర్తలకు పార్టీ అండ: కే కే చౌదరి

నిజాయితీగా ఉన్న కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమ అభివృద్ధి ఛైర్మన్ కేకే చౌదరి తెలిపారు. చిట్వేలి బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తెలుగు జాతి ఆత్మగౌరవం టీడీపీ : ముక్కా

రైల్వేకోడూరు, మార్చి29(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఆత్మగౌరవం టీడీపీ అని కుడా ఛైర్మన్, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. శనివారం రైల్వేకోడూరు పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో రైల్వేకోడూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదల పార్టీ టీడీపీ

రాయచోటిటౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగు దేశం పేదల పార్టీ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు కొనియాడారు. శనివారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు.




జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి.. కోడూరు: నివాళులర్పిస్తున్న పంతగాని

రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి గెలుపు

రాయచోటిటౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి): రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో రాయచోటి బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఎన్. ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. పోలైన 87 ఓట్లలో 48 ఓట్లు ప్రభాకర్‌రెడ్డికి రాగా ప్రత్యర్థి అయిన రమేశ్‌రెడ్డికి 39 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి ప్యానెల్‌గా నుండి పోటీ చేసిన ధనుంజయకుమార్ ప్రత్యర్థి రామచంద్రారెడ్డిపై ఒక్క ఓటుతో గెలిపారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా పీ. రెడ్డిబాషా తన ప్రత్యర్థి పగడాలని శ్రీనివాసులపై 11 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ట్రెజరర్‌గా పోటీ చేసిన ఆదిరెడ్డినాయక్ తన ప్రత్యర్థి అయిన నాగరాజపై 4 ఓట్ల మెజార్టీతో గెలిచారు. లైబ్రరీ సెక్రటరీగా టీవీ రమణ తన పత్యర్థి రామ్‌కుమార్‌పై 2 ఓట్ల మెజార్టీతో గెలిచారు. స్పోర్ట్స్ కార్యదర్శిగా వేల్పుల సిద్దయ్య తన ప్రత్యర్థి కంచపు బాలచంద్రపై 15 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఎన్నికల అధికారిగా కే. రాజకుమార్‌రాజు వ్యవహరించి గెలిచిన అభ్యర్థులందరికీ డిక్లరేషన్ ఫామ్స్ అందజేశారు. రాయచోటి బార్ అసోషియేషన్ ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి ప్యానల్ అభ్యర్థులు గెలిచిన సందర్భంగా ఆయన మద్దతుదారులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

రామాపురం, మార్చి29(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రామాపురం మండలం గువ్వలచెరువులో శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సకల శుభాలకు నాంది ఉగాది

రాయచోటిటౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి): సకల శుభాకాలకు నాంది ఉగాది అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తీపి, చేదు కలగలిపినదే జీవితమని, కష్టం, సుఖం ఉంటేనే నిజమైన జీవితమని, ఆ జీవితంలో ఆనందోత్సాహాలని పూయించేందుకు వచ్చేదే ఉగాది అన్నారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా, సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

'దళిత ఉద్యోగుల జోలికి వస్తే సహించేది లేదు'

రైల్వేకోడూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగుల జోలికి వస్తే సహించది లేదని టీడీపీ రాష్ట్ర సంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు అటవీ శాఖ రేంజర్ శ్యాంసుందర్ పై కొందరు దళిత ఉద్యోగి పై చేసిన విమర్శలు సబబుకాదన్నారు. దళిత అధికారులను చిన్నచూపు చూస్తూ విధులకు ఆటంకం కల్గించరాదన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి

నందలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా ప్రతిఒక్కరు పాటించాలని ఏఎస్ఐ మోసెస్ పేర్కొన్నారు. శనివారం ట్రాఫిక్ సమస్యలపై ఆటో డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తన పట్ల గమనిస్తూ చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాలన్నారు.

పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు : సీఐ

రాజంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ సీఐ రాజా తెలిపారు. శనివారం సాయంత్రం పాతబస్టాండు కూడలిలో స్థానిక యువతకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, వాహనదారులు, యువత పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు పొంగళ్లు

పెనగలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈటమాపురం గ్రామంలో వెలసి ఉన్న గ్రామదేవత రేణుకాఎల్లమ్మ తల్లికి ఆదివారం ఉదయం పొంగుబాళ్లు కార్యక్రమం జరుగుతుందని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల శివశంకర్ తెలిపారు. మండల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పోక్సో యాక్ట్‌పై విద్యార్థినులకు అవగాహన

సిద్దవటం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు శనివారం పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. మండల లీగల్‌సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడప మూడో అదనపు కోర్టు జడ్జి, జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఇన్‌చార్జి జడ్జి జయలక్ష్మి మాట్లాడుతూ పోక్సో యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్, స్థానిక పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు: మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ ఛైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి భార్గవిచే శనివారం ప్రజలకు పోక్సో చట్టంపైన అవగాహన కల్పించారు.

ప్రసాదాల పంపిణీపై జీఎస్టీ రద్దు శుభ పరిణామం

పెనగలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల్లో భక్తులకు అందజేసే ప్రసాదాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయడం ఎంతో శుభపరిణామమని పెనగలూరు మండల బీజేపీ అధ్యక్షుడు కోనేటి రెడ్డిక్రిష్ణరాయల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

7న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

రాయచోటిటౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏప్రిల్ 7న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్ ఇతర వైద్యులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి సంబంధించిన కొత్త సభ్యులను ఎన్నుకున్నామని, కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేస్తామన్నారు.

పేద విద్యార్థులకు రంజాన్ కానుక పంపిణీ

రాయచోటిటౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మార్కెట్‌కు పాఠశాలలో శనివారం ఆజాద్ ఎడ్యుకేషనల్ అండ్ మైనార్టీ వెల్ఫేర్ అసోషియేషన్ తరఫున పేద విద్యార్థులకు రంజాన్ కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాయచోటి ప్రాంతంలోని పలు ఉర్దూ పాఠశాలల నుండి 100 మంది పేద విద్యార్థులను ఎంపిక చేసి సుమారు రూ.50 వేల నగదు పంపిణీ చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రాయచోటిటౌన్, మార్చి29(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మహిళలు శక్తియాప్ వాడకంపై ఆ సంస్థ అధినేత శ్రీనివాసులరెడ్డితో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సామాజిక సేవా కార్యక్రమాలను వేగవంతం చేస్తాం



మాట్లాడుతున్న ప్రసాద్‌వర్మ

రైల్వేకోడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలను వేగవంతం చేస్తామని మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కీర్తిపాటి ప్రసాద్‌వర్మ తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో సమావేశం నిర్వహించారు. మనవతా సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ముద్దలూరు చంద్రమోహన్‌రాజు, చంగల్‌రెడ్డి, పొన్నూరు నిరంజన్‌బాబు, మస్తాన్, చంద్రశేఖర్, శివరాజు, నారాయణ, రాజజేశ్వరి, శారద తదితరులు పాల్గొన్నారు.

పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి

సిద్దవటం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):రంజాన్, ఉగాది పండుగలను హిందూ ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ తెలియజేశారు. సిద్దవటం ఆకులవీధిలో శనివారం రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ మాట్లాడుతూ తెలుగు సంవత్సరాతి ఉగాది, రంజాన్ పండుగ హిందూ ముస్లిం సోదరులు సోదర భావంతో ఐకమత్యంగా చేసుకోవాలని రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నెలపాటు పవిత్రంగా ఉపవాసాలు ఉన్నారని, అల్లా అనుగ్రహం ప్రతిఒక్కరికి ఉండాలని, హిందూ సోదరులు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

కువైత్‌లో ఇఫ్తార్ విందు


పెనగలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కువైత్‌లో ఉన్న భారత ముస్లింలకు శుక్రవారం రాత్రి కువైత్ జనసేన పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి హరిబాబురాయల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కువైత్ జనసేన పార్టీ నాయకులు గంధ ప్రసాద్, బి.శ్రీనివాస్, జి.రమేష్, పి.వెంకిరాయల్, డి.పృథ్వి, ఎ.రెడ్డయ్య, ఎస్.మల్లికార్జున, ధరణి, ప్రదీప్‌లకు ఆయన ధన్యావాదములు తెలిపారు.

క్యాన్సర్ రోగికి మందులు పంపిణీ

సిద్దవటం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కొందరు అందరిలా కాదు.. ఇతరులకు ఏదైనా అవసరం వస్తే ముందుంటారు. ఈ కోవకు చెందిన వారే సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామానికి చెందిన మన ఊరికోసం స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు.. కడప ఇందిరానగర్‌లో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాబ్జి అనే వ్యక్తికి గత ఆరు సంవత్సరాల పైనుండి ప్రతినెలా రూ.2500 విలువ చేసే మందులను అందజేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా శనివారం సంస్థ సభ్యులు మాసా బాలక్రిష్ణ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కలిసి అతని ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకుని రూ.2500 విలువ చేసే మందులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ రవిశంకర్ మాట్లాడుతూ ఇతనికి మందులు ఇవ్వడానికి ప్రతినెలా సహకరిస్తున్న దాతలకు మన ఊరికోసం స్వచ్ఛంద సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీకాంత్, బాలక్రిష్ణ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పండగ సందడి

- కిటకిటలాడిన మార్కెట్లు.. వస్త్ర దుకాణాలు
- పూలంగళ్ల వద్ద జనం రద్దీ ● ఎటు చూసినా ట్రాఫిక్ జాం



పూలు, మామిడి ఆకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పీలేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో శనివారం సాయంత్రం పండుగల సందడి నెలకొంది. అటు తెలుగు సంవత్సరాది ఉగాది, ఇటు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందడికి కారణమైంది. పండుగల కోసం నిత్యావసర సరుకులు, పూజాసామాగ్రి, కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు శనివారం సాయంత్రం ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం కిటకిటలాడింది. పూల అంగళ్లు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. పూజా సామాగ్రి అంగళ్ల వద్ద రద్దీ నెలకొంది. ఉగాది సందర్భంగా తమ పూర్వీకులకు బట్టలు పెట్టుకునే సంప్రదాయం ఉండడంతో బయటి ప్రాంతాల్లో ఉన్న చాలామంది తమ సొంతూ ర్లకు పయనం కావడంతో ఆర్టీసీ బస్టాండు ప్రయాణీకులతో కిటకిటలాడింది. అంతేకాకుండా రం జాన్ పండుగ కోసం ముస్లింలు సైతం పెద్దఎత్తున కొనుగోళ్ల కోసం బయటకు రావడంతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి.





పీలేరులో పండ్లు, దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మదనపల్లెలో...



మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్ పూలమార్కెట్‌లో రద్దీగా జనం

ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా మదనపల్లె పట్టణంలో జనం కిక్కిరిసిపోయారు. శనివారం సాయంత్రం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో పూల అంగళ్ల వద్ద జనం రద్దీగా కనిపించారు మదనపల్లె పట్టణం, రూరల్ ప్రాంతాల నుంచి జనం ఎక్కువగా పట్టణంలోకి పండగ సామాగ్రి కొనుగోలు చేయడానికి రావడంతో మార్కెట్లు, రోడ్లు రద్దీగా మారిపోయాయి. వాహనాలు ఎక్కువగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ జామ్ అయి వాహనాలు రోడ్డుపై బారులు తీరాయి. మల్లికార్జున సర్కిల్ నుంచి టౌన్ బ్యాంకు సర్కిల్ వరకు ట్రాఫిక్ జామ్ అయింది.

జిల్లాలో తాగునీటి సమస్య ఉండకూడదు

- *1వ తేదీ పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలి*
- *కలెక్టర్ చామకూరి శ్రీధర్*



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఉండకూడదని, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, 1వ తేదీ పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ సిబ్బంది, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య కనిపించకూడదని, దానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియాకు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎన్జీవోలు, దాతలతో సమన్వయం చేసుకొని ప్రజలందరికీ చలివేంద్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి పింఛన్ల పంపిణీ జరగాలని ఆదేశించారు. పల్లె పండుగ పనులపై సమీక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ సిబ్బందిని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలను నాణ్యతతో, అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీలో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని మండలాల్లో ఎన్టీఆర్ హౌసింగ్‌లో స్టేజీ కన్వర్షన్ అవ్వాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ ఆధారితమైన మన జిల్లాలో 100 రూపాయల్లో 21 రూపాయల ఆదాయం ఉద్యానవనశాఖ నుంచి మరో 21 రూపాయల ఆదాయం పశుపోషణ ద్వారా వస్తుందని కేవలం ఐదు శాతం మాత్రమే వ్యవసాయం మీద ఆదాయం వస్తోందని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనను వినియోగించుకోవాలి

ఏప్రిల్, మే, జూన్ నెలల గ్రామీణ ఉపాధి కల్పన ప్రణాళికలోని పంచ ప్రాధాన్యాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా ప్రజలకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డ్వామా పీడీ వెంకటరత్నంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్, మే, జూన్ నెలల ఉపాధి కల్పన ప్రణాళికలోని పంచ ప్రాధాన్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల అభివృద్ధిలో భాగంగా అతి ముఖ్యమైన ఐదు అంశాలైన పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం, సేద్యపు నీటి కుంటల నిర్మాణం, పంట కాలువల్లో పూడిక తీయడం, సాగునీటిల చెరువుల్లో పూడికతీత, సగటు వేతనం రోజుకు కనీసం రూ.300 ఉండేలా చూడడం అనే ఐదు అంశాలు లక్ష్యంగా ఏప్రిల్, మే, జూన్ నెలల ఉపాధి కల్పన ప్రణాళికను రూపొందించామన్నారు. జిల్లా ప్రజలందరూ ఈ పంచ ప్రాధాన్యాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు.

కారు దహనం కేసులో నిందితుడు అరెస్టు

రామసముద్రం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో సంచలనం కలిగించి ఉద్రిక్తతకు దారి తీసింది మండల టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడుకు చెందిన ఇన్నోవా కారు దహనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. రామసముద్రం పంచాయతీ గుంతల పేట గ్రామానికి చెందిన నూలు శ్రీనివాసులు కారు దహనానికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫైళ్ల దహనం కేసులో సీఐడీ విచారణ



రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేస్తున్న సీఐడీ అధికారులు

వాల్మీకిపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసుకు సంబంధించి శనివారం వాల్మీకిపురం కార్యాలయంలో సీఐడీ విచారణ చేపట్టింది. రైతులతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం విషయమై మండలంలోని 26 మంది రైతులకు చెందిన ఫైళ్లు దహనం కావడం, తదితర విషయాలపై సీఐడీ అధికారులు ఆరా తీశారు. రైతులు స్వయంగా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారా అక్కడ ఎవరితోనైనా మాట్లాడారా తదితర విషయాలను నేరుగా రైతులతో చర్చించారు. అలాగే పలు వివరాలను రైతుల నుంచి రికార్డు చేశారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్ఐ మంజుల, వీఆర్వో స్వర్ణలత, రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

నాటుసారా, మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) మండలంలో నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో సీటీఎం దళితవాడలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మస్తాన్ భార్య ఎర్రబల్లి బుజ్జి (42), వెంకటరమణ కుమారుడు పి.లక్ష్మీనారాయణ వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే చీకిలబైలు గ్రామంలో జె.శ్రీనివాసులు భార్య జె.నాగమ్మ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఆమె వద్ద 31 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అలాగే మొదటి ఇద్దరు నిందితులకు నాటుసారా సరఫరా చేసిన మేకలవాండ్లపల్లెకు చెందిన మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు డోర్కాస్, జబీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ కుటుంబానికి ఆర్థికసాయం



రామకృష్ణ కుటుంబానికి నగదు అందిస్తున్న ఎన్ఆర్ఐ లోకేశ్

మదనపల్లె టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం కృష్ణాపురంలో వైసీపీ నాయకుడి చేతిలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబానికి మదనపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ లోకేశ్ కొణిదల ఆర్థికసాయం చేశారు. శనివారం రాత్రి కృష్ణాపురానికి వెళ్లిన ఎన్ఆర్ఐ లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి నిలిచిన ప్రతి ఒక్కరికి పార్టీ అధిష్ఠానం అండగా ఉంటుందన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తన వంతు రామకృష్ణ కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థికసాయం అందించానన్నారు. కార్యక్రమంలో పెరవలి నవీన్, రాజేష్, నిరంజన్‌నాని, మార్పురి రమేశ్, వంశీనరసింహ, గగన్‌సాయి, మహేష్, రామకృష్ణ కుమారులు పాల్గొన్నారు.

పండుగలను సంతోషంగా జరుపుకోవాలి

రాజంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, దేవాలయాల వద్ద, మసీదుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో శనివారం ఉదయం స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. వేకువజామునే ఆలయ అధికారులు పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలను అర్చకులకు అందజేశారు. ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు మనోజ్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన
హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఆదినారాయణ కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ



హెడ్‌కానిస్టేబుల్ సతీమణికి నగదు అందజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆదినారాయణ ఈనెల మొదటి వారంలో పీలేరులోని ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ మృతి పట్ల ఎస్పీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల వాల్మీకిపురం ఎస్ఐ చంద్రశేఖర్, సహోద్యోగులు చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల మండలం మంగళంపేట బలిజపల్లెలోని హెడ్ కానిస్టేబుల్ స్వగృహంలో ఉన్న ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు దహన సంస్కారాలకు లక్ష నగదును ఆయన సతీమణికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో
ఇరువురికి తీవ్రగాయాలు



గాయపడిన ఇరగంరెడ్డి

రామాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం నీలకంఠ్రావుపేట గ్రామం శివాలయం వద్ద శనివారం బైక్ అదుపు తప్పి ఆవుల ఇరగంరెడ్డి మరో బాలికకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... గాలివీడు మండలం నూలివీడుకు చెందిన ఆవుల ఎర్రగంరెడ్డి మరో బాలిక కడపలో చదువుతున్నారు. సెలవుల కారణంగా వారిరువురు బైక్‌పై ఇంటికి వస్తుండగా శివాలయం వద్దకు రాగానే ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగింది. వేగంగా వస్తున్న బైక్‌ను అదుపు చేయలేక బస్సును వెనుక వైపు నుంచి ఢీకొనడంతో ఇరువురు గాయపడ్డారు. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీరభద్రాలయంలో
అమావాస్య పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు భద్రకాళీ అమ్మవారు వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగించారు.

చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం





ప్రత్యేక వెండి అలంకరణలో చౌడేశ్వరీదేవి, ఊరేగింపుగా దివ్వెలను తీసుకెళుతున్న మహిళలు

మదనపల్లె అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉగాది, చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే గణపతి, చౌడేశ్వరిదేవి, సుబ్రహ్మణ్యం స్వాములకు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మదనపల్లె పట్టణంలోని, నీరుగట్టువారిపల్లె పురవీధుల నుంచి మున్నెప్పకాలనీ, కనక దాస్ నగర్, అయోధ్యనగర్, కాట్లాటపల్లె రోడ్డు, రామిరెడ్డి లేవుట్, చంద్రాకాలనీ, అనప గుట్ట నుంచి కూడా మహిళలు భక్తి శ్రద్ధలతో దీలు బోనాలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు.

అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని చౌడేశ్వరీదేవిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, సెక్రటరీ బండి పవన్ కుమార్, ట్రెజరర్ రత్నమయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండి నాగరాజ, రామిశెట్టి నీలకంఠ, రామిశెట్టి అంజనేయులు, శీలం రమేష్ బాబు, వెంకటేశ్, సిద్దప్ప, పాల్గొన్నారు.

చోరీ యత్నం విఫలం ... ఒకరిపై దాడి

నందలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నీలిపల్లె గ్రామంలో శనివారం వేకువజామున సనవర్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి ప్రయత్నించారు. ఏఎస్ఐ ఐ.మోసెస్ వివరాల మేరకు... బడేరాత్ సందర్భంగా పాటూరుకు వెళ్లిన ఆ ఇంటిలోని యువకులు షేక్ సల్మాన్, షేక్ షబ్బీర్‌బాషాలు ఇంటివద్దకు వచ్చి చూడగా గేటు తెరచి ఉండడం గమనించారు. అలికిడి విన్న దొంగలు పారిపోయే ప్రయత్నంలో షేక్ సల్మాన్‌పై ఇనుపరాడ్‌తో దాడి చేశారు. దొంగలు వేసుకొచ్చిన బైకుతో పాటు దాడి చేసిన రాడ్, చెప్పులను అక్కడే వదిలి వెళ్లారు. ఈ సంఘటనపై యువకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని బైకు, ఇనుపరాడ్, చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

పేకాట నిర్వహణ ఆరోపణలతో
కానిస్టేబుల్ సస్పెన్షన్

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలతో కానిస్టేబుల్ రామాంజులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామాంజులు కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా రాయచోటి మండల పరిధిలో పలు ప్రాంతాల్లో పేకాట నిర్వహణ విషయంలో బయట ప్రాంత వ్యక్తులకు ఆశ్రయం కల్పించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసిన సమయంలో పట్టుబడిన వారిలో కానిస్టేబుల్ కూడా ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పేకాట నిర్వహణ విషయంలో కానిస్టేబుల్ పాత్రపై విచారణ చేపట్టి రామాంజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

బాలుడిపై లైంగిక దాడి కేసులో
నిందితుడు అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సంబేపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలుడుపై తిరుపతి రమేశ్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన సంఘటనలో నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.... రమేశ్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. 28వ తేదీ బాలుడు ఇంటి ముందు సైకిల్ తొక్కుకుంటున్న సమయంలో బాలుడిని అపహరించి అతనిపై లైంగిక దాడికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు తిరుపతి రమేశ్‌ను అరెస్టు చేసి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

వేలం ద్వారా రూ.10 లక్షల ఆదాయం

పెద్దమండ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలంలో వారపు సంతల నిర్వహణకు శనివారం నిర్వహించిన వేలం ద్వారా రెండు గ్రామ పంచాయతీలకు రూ.10.12 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, శేషాద్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దమండ్యం వారపు సంత నిర్వహణకు విశ్వనాథ రూ.6.40 లక్షలు అత్యధికంగా వేలం పాట పాడగా, బస్టాండ్ గేట్ వసూలుకు రఫీ రూ.78 వేలకు, తురకపల్లి వారపు సంతకు ఉమర్ రూ.2.34 లక్షలు, పసలబండ గేటు వసూలుకు వెంకటరమణ రూ.60 వేలు వేలం ద్వారా దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

మందుబాబుల అడ్డా పెద్దచెరువు





కోడూరు పెద్ద చెరువు గట్టుపై పగలు, రాత్రి మద్యం తాగుతున్న మందుబాబులు

రైల్వేకోడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కోడూరు పెద్ద చెరువు అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ప్రతిరోజూ సాయంత్రం కాగానే చెరువు వద్దకు మందుబాబులు చేరుకుని మద్యం తాగుతూ చిందులేస్తున్నారు. కోడూరు పెద్ద చెరువు దగ్గర గుండాలపల్లె, పాటిమీదిపాళెం, బయనపల్లె, అగ్రహారం, రెడ్డివారిపల్లె తదితర ప్రాంతాలకు సమీపంలో ఉంది. ఆటోలు, మోటారు బైకుల్లో వస్తున్న మందుబాబులు ఇక్కడ ఆగి మద్యం తాగుతున్నారు. ఇక్కడ ఓ ప్రైవేటు స్కూలు ఉంది. స్టడీ అవర్ చూసుకుని విద్యార్థులు ఆయా గ్రామాలకు రాత్రి 7 గంటలకు వెళుతుంటారు. ఆకతాయిలు, మందు బాబులు ఇక్కడ హల్‌చల్ చేస్తుంటారు. దీంతో ఇటు విద్యార్థులు, అటు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 10 గంటల వరకు మందుబాబులు ఉంటున్నారు. తాగి చిందులు వేయడంతో పాటు బూతు పురాణాలు చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా పెద్దచెరువు మద్యం తాగుతున్నారు. పోలీసులు ఇక్కడ నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో టీడీపీని బలోపేతం చేద్దాం

- మదనపల్లెలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం
- కొన్నిచోట్ల విడివిడిగా..
- బయటపడిన వర్గపోరు

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ములకలచెరువులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జయచంద్రారెడ్డి, తంబళ్లపల్లెలో టీడీపీ నాయకులు





మదనపల్లె టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్ఫూర్తితో, చంద్రబాబునాయుడు ఆదర్శంగా నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మదనపల్లెలోని తన నివాసంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం నిమ్మనపల్లె సర్కిల్, కమ్మవీధి, మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ జెండాలను ఆవిష్కరించారు. అలాగే ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నీరుగట్టువారిపల్లె వద్ద టీడీపీ జెండా ఆవిష్కరించి, పేదలకు అన్నదానం చేశారు. మండలంలోని సీటీఎం గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జి చల్లా నరసింహులు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మస్తాన్, విద్యాసాగర్, వెంకటేశ్, రామకృష్ణాచారి, శ్రీనివాసులునాయుడు, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ శ్రేణులు శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతి రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించడమే కాకుండా వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమాల్లో పార్టీ నేతలు శ్రీకాంత్ రెడ్డి, గీతాంజలి, ఎంజీపీ రమణ, కోటపల్లె బాబు, అమరనాథరెడ్డి, లడ్డూ జాఫర్, కండక్టర్ రమణ, సంఘం శివారెడ్డి, షౌకత్ అలీ, పురం రామ్మూర్తి, పురం రెడ్డమ్మ, లక్ష్మీకాంతమ్మ, షమ, స్వర్ణ, రహంతుల్లా, గాండ్ల విజయ్ కుమార్, శేఖర, శ్రీనివాసులు, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ ద్విచక్రవాహన ర్యాలీతో వచ్చి బస్టాండు సర్కిల్‌లో కేక్‌ను కట్ చేశారు.

టీఎన్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నుంచి బస్టాండు సర్కిల్ వరకు భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించి అక్కడ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, పోతుల సాయినాథ్, వెంకటస్వామి, చెన్నకిష్టా, ముత్తుకూరు మౌలా, సుధాకర్‌నాయుడు, కేశవులు, విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో..

నిమ్మనపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండులో పార్టీ జండాను ఎగరవేసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అలాగే రాచవేటివారిపల్లి గ్రామలో టిడిపి అధికార ప్రతినిధి ఆర్వీ వెంకటేష్, చెరువుముందరపల్లిలో రెడ్డెప్ప ఆధ్వర్యంలో సంబరాలు చేసుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపులమ్మ, మునిరత్నం, లక్ష్మన్న, విజయ్, సిద్దరామ్, చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలికిరి క్రాస్‌రోడ్డు వద్ద ఆ పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. చంద్రబాబు పాలన యువతకు మార్గదర్శకంగా వుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ ఎంపీపీ నాగభూషణరెడ్డి, మాజీ జడ్పీటీసీ మాలతి, విజయకుమార్‌రెడ్డి, దాము, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గుర్రంకొండలో శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండులో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, మూర్తిరావు, మురళీ, సుంకర శేఖర్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలకడలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, అబ్బూరి తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో..

కురబలకోట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ముదివేడులో నియోజకవర్గ పరిశీలకులు సీడు మల్లికార్జుననాయుడు ఆధ్వర్యంలో, అలాగే అంగళ్లు, సర్కారుతోపులో జరిగిన కార్యక్రమానికి రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ బాషా, తిమ్మరాయుడు, సురేంద్ర, రమణ, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పీటీఎంలో..

పెద్దతిప్పసముద్రం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పీటీఎంలో స్థానిక నాయకులు రెండు వార్గాలుగా నిర్వహించారు. ఉదయం జయచంద్రారెడ్డి అనుచరులు స్థానిక బస్టాండులో పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గీయులు అదేచోట పార్టీ జెండాను ఆవిష్కరించి భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జయచంద్రారెడ్డి వర్గీయులు సింగల్ విండో మాజీ ఛైర్మన్ సంపతికోట కిట్టన్న, కట్టా సురేంద్రనాయుడు, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, శంకర్ యాదవ్ వర్గీయులు మొలకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమక శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ టూటం ఈశ్వరప్ప, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం నిరుపేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ సురేంద్రవర్మ, నారాయణ, రాజేంద్రాచారి, కువైట్ సయ్యద్‌బాషా, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



ములకలచెరువులో నివాళులర్పిస్తున్న టీడీపీ నేత దొరస్వామినాయుడు, మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, తదితరులు

టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పర్వీన్‌తాజ్



బి.కొత్తకోటలో పోటాపోటీ..

బి.కొత్తకోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ వేడుకలను పట్టణంలోని జ్యోతిచౌక్‌లో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ ఆధ్వర్యంలో ఒకచోట, మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, నియోజకవర్గ పోల్‌మేనేజ్మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు ఆధ్వర్యంలో మరోచోట పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. జ్యోతిచౌక్‌లో అనాదిగా వున్న పాత జెండా దిమ్మె వద్ద మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గం వేడుకలు జరుపుకున్నారు. కాగా పార్టీ ఇంచార్జ్ జయచంద్రారెడ్డి వర్గీయులుగా భావిస్తున్న నాయకులు జ్యోతిచౌక్‌లోనే మరోచోట రాత్రికిరాత్రి కొత్తగా మరో జెండాదిమ్మెను నిర్మించి అక్కడే పార్టీపతాకాన్ని ఆవిష్కరించారు. ఇరువర్గాలు పోటాపోటీగా వేడుకలకు సిద్ధం కావడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు సిబ్బందితో అక్కడే వున్నారు. కాగా మండలంలోని గట్టు, మొటుకు గ్రామాలలో సైతం టీడీపీ ఆవిర్భావ వేడుకలను స్థానిక నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాలలో నాయకులు బంగారువెంకట్రమణ, దేవరింటి కుమార్, కనకంటి ప్రసాద్, దేరంగుల నారాయణ, గంజి మోహన, లోకనాథ్‌రెడ్డి, మొటుకు శివ, గట్టు రెడ్డెప్ప, సమీవుల్లా, ఎండీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలోనూ..

తంబళ్లపల్లె, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడకలను జయచంద్రారెడ్డి వర్గీయులు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గీయులు వేర్వేరుగా నిర్వహించారు. ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. వేడుకను ముందు మేము చేయాలంటే.. మేము చేయాలని పట్టుబట్టడంతో స్వల్ప ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఇరువర్గాలకు సర్దిచెప్పటంతో పరిస్థితి సద్దుమణిగింది. దీంతో తొలుత జయచంద్రారెడ్డి వర్గీయులు టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి,సిద్దమ్మ, తులసీధర్ నాయుడు, బేరిశీన, తదితరులు భారీ కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరించారు. అనంతరం శంకర్‌యాదవ్ వర్గీయులు పురుషోత్తం, వీరాంజినేయులు, గంగరాజు, వెంకటరెడ్డి తదితరులు బాణసంచా పేల్చి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెద్దమండ్యంలో వేర్వేరుగా..

పెద్దమండ్యం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎన్‌టీఆర్‌తోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ చైతన్యం వచ్చిందని టీడీపీ మండల నేతలు పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. దాసరిపల్లి జయచంద్రారెడ్డి వర్గీయులు తెలుగు యువత అధ్యక్షుడు నారా గంగాధర, తుమ్మల మహేశ్వర, చలపతి, మణి, సుబ్బయ్య, మల్లికార్జున తదితరులు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గీయులు టీడీపీ మండల అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి బుక్కే మనోహర్‌నాయక్, రాజంపేట ఎస్టీ సెల్ నాయకుడు, సర్పంచ్ నటరాజ్‌నాయక్, నారా శ్రీనివాసులు, తదితరులు వేర్వేరుగా టీడీపీ జండాను ఆవిష్కరించారు. అలాగే సిద్దవరంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, తురకపల్లిలో టీడీపీ మాజీ అధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కాలేషా తదితరులు పార్టీ జండాను ఆవిష్కరించారు.

రామసముద్రంలో విడివిడిగా..

రామసముద్రం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం టీడీపీలో నెలకొన్న వర్గపోరుతో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బయటపడింది. మొదట మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు జరగగా అనంతరం వేరే వర్గం వారు విడిగా వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రం, చెంబకూరు, జంగాలపల్లెలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌గౌడు ఆధ్వర్యంలో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌వీ శ్రీనివాస్‌గౌడు, కొండూరు నారాయణరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బండెల శివ, బండ్ల జన, హరినాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వేణు, రమేష్, సలీం, పాలశీన, జావీద్, విశ్వనాథరెడ్డి, అరవ శీనప్ప, మహ్మద్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



రామసముద్రంలో కేక్ కట్ చేస్తున్న విజయకుమార్‌గౌడు, కొండూరు నారాయణరెడ్డి



పీలేరులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ శ్రేణులు



గుర్రంకొండలో..



కురబలకోట మండలం ముదివేడులో..



వాల్మీకిపురంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అధికారంలో ఉన్నామా.. ప్రతిపక్షంలో ఉన్నామా..

- అర్థం కాని పరిస్థితి
- లంచాలు ఇచ్చిన వాళ్లకే పనులు జరుగుతున్నాయి
- పార్టీని, కార్యకర్తలను సమన్వయం చేసుకునే వాళ్లు కరువయ్యారు
- పీలేరులో పలువురు సీనియర్ టీడీపీ కార్యకర్తల ఆవేదన



పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గాండ్ల విజయ్ కుమార్

పీలేరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పీలేరు తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి శనివారం జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బయటపడింది. ఇంతకాలం తమ బాధలు ఎవరికి, ఎలా చెప్పుకోవాలో తెలియక నలిగిపోయిన పలువురు నాయకులు, కార్యకర్తలు తమ అంతరంగాన్ని నాయకుల ముందు ఆవిష్కరించారు. తమ పార్టీ అధికారంలో ఉన్నా కూడా తమ పనులు జరగడం లేదని, కూటమి నేతలు, శ్రేణులను అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని, ఏ కార్యాలయంలో చూసినా వైసీపీ నాయకులు, కార్యకర్తల పనులు జరుగుతున్నాయని, లంచాలు ఇచ్చిన వారి పనులు మాత్రం సజావుగా జరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ కార్యకర్తలైన గాండ్ల విజయ్ కుమార్, రహంతుల్లా, శేఖర మాట్లాడుతూ 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ వారు బెదిరిస్తే భయపడకుండా టీడీపీ జెండా భుజాలకెత్తుకున్నాం. కేసులు పెడితే పెళ్లాం పిల్లల్ని నెలలపాటు వదిలేసి బయట ప్రాంతాల్లో తలదాచుకున్నాం. వైసీపీ వాళ్ల ఆగడాలను భరించాం. అధికారంలోకి వచ్చిన తరువాతనైనా పరిస్థితి మారుతుంది అనుకుంటే మరింత ఇబ్బందిగా తయారైంది. స్థానికంగా కొంతమంది నాయకుల తీరు కారణంగా పార్టీలో అంతర్గత కలహాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఏ నాయకుడి దగ్గరకు వెళితే ఏ నాయకుడికి కోపం వస్తుందోనని భయపడాల్సిన దుస్థితి ఉంది. ఇక్కడ జరుగుతున్న విషయాలు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి చక్కదిద్దే పెద్ద దిక్కు కనబడడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మేం ఎలా బతకాలి. మమ్మల్ని పట్టించుకోండి' అంటూ తమ ఆవేదన వెలిబుచ్చారు.

దీంతో స్పందించిన మండల పార్టీ అధ్యక్షులు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి మాట్లాడుతూ పార్టీకి, కార్యకర్తల మధ్య గ్యాప్ వచ్చిన విషయం వాస్తవమేనని, ఇకపై ఆ పరిస్థితి రాకుండా చూసుకుంటామన్నారు. ప్రతి నెలా రెండుమార్లు కార్యకర్తల సమావేశం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకుని అధికారులతో మాట్లాడి పరిష్కరించే వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యకర్తల మనోభావాలు, ఆలోచనలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని భరోసా ఇవ్వడంతో చాలా మంది శాంతించారు.

మదనపల్లె కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో రూ.155.08 కోట్లు వ్యాపార ధనం



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్

మదనపల్లె, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో వ్యాపార ధనం రూ.155.08 కోట్లు ఉందని ఛైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్ అన్నారు. టౌన్ బ్యాంకులో శనివారం సాధారణ మహాసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.90.55 కోట్లు బ్యాంకు డిపాజిట్లు, రూ.64.53 కోట్లు బ్యాంకు అప్పు ఇచ్చిందన్నారు. దేశ స్వాతంత్ర్యానికి ముందు 1924 సంవత్సరంలో స్థాపించిన బ్యాంకు గత ఏడాది జూన్ నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. బ్యాంకు శత సంవత్సర సంబరాలు మే నెలలో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ భాస్కర్‌కుమార్, డైరెక్టర్లు రవికాంత్, రవీంద్రనాథ్, ముక్తియార్‌ఖాన్, సోమశేఖర్, నాదెళ్ళ వెంకటేశ్వరప్రసాద్, ఆకుల కృష్ణమూర్తి, దేవేంద్రబాబు, సర్దార్‌ఖాన్, నిరంజన్‌కుమార్, భాస్కర్, ప్రొఫెషనల్ డైరెక్టర్లు ప్రసాద్, కోటేశ్వరరావు, బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, మేనేజర్ జయచంద్రనాయుడు, రవింద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో రెసిడెన్షియల్ కింద అప్రూవల్ తీసుకుని కమర్షియల్ బిజినెస్, ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తూ మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన నాయకులు శనివారం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బహుజన్ యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో 70 శాతం వరకు రెసిడెన్షియల్ పర్పస్ కోసం అప్రూవల్ తీసుకుని కమర్షియల్ బిజినెస్‌లు, ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తుండడంతో రెండు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆదాయానికి ప్రతి ఏటా కోట్లాది రూపాయలు నష్టం కల్గిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు హరీష్, ఆది, శశికుమార్, జిలానీ, బాలకృష్ణ, శ్రీనివాసులు, జగదీష్, తారక్ ఉదయ్, గౌతమ్, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బహుజన యువసేన నాయకులు

నేడు, రేపు బోయకొండ గంగమ్మ తిరునాళ్లు

పీలేరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లెలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 30, 31వ తేదీల్లో తిరునాళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, అన్నపూర్ణ క్యాటరింగ్ సర్వీసెస్ అధిపతి చలపతి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, రాత్రి కోలాటాలు, చెక్కభజనలు, అన్నదాన కార్యక్రమం, అలాగే సోమవారం ఉదయం పుష్పపల్లకి ఊరేగింపు, సాయంత్రం పొంగళ్లు ఉంటాయని ఆయన తెలిపారు.

ప్రమాద రహిత డ్రైవింగ్‌పై కౌన్సెలింగ్

బి.కొత్తకోట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు తావులేని సురక్షిత డ్రైవింగ్‌తో తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను కూడా కాపాడవచ్చునని సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు అన్నారు. పట్టణ పరిధిలోని ఆటోడ్రైవర్లకు, అదేవిధంగా పట్టణంలో రాష్‌డ్రైవింగ్ చేస్తున్న మైనర్ బాలురను, తల్లిదండ్రులను స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం అమలు చేస్తున్న ట్రాఫిక్ నిబంధనలు, జరిమానాలపై అవగాహన కల్పించారు.

అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోవాలి



అక్రమ లేఔట్లపై ఫిర్యాదు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వాల్మీకిపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వేసిన లేఔట్లపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. శనివారం యూనియన్ నాయకులు, సభ్యులతో కలిసి ఈవోఆర్డీ సుధాకర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూమిగా మార్చకుండానే పలుచోట్ల భూములను చదును చేసి ప్లాట్లు వేసి విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే పంచాయతీ అనుమతులు కూడా తీసుకోవడం లేదని, ఇటువంటి రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్‌కుమార్, వెంకటేష్, గంగాధర్‌నాయుడు, ఆదిత్య హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

మదనపల్లె టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో మిరప సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ శివశంకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎనుములవారిపల్లెలో రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్టు, అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రీయ మిరపక్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన మిరప ఎనిమిది నెలల్లో 3,160 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీల అభివృద్ధికి కృషి

● 'సివిల్‌రైట్స్ డే'లో తహసీల్దార్ అమరనాథ్



నిమ్మనపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ అమరనాథ్ అన్నారు. శనివారం నిమ్మనపల్లి పంచాయతీ గంగాపురంపల్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం నిర్వహిచారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రతి నెల సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను తెసుకొని వాటిని పరిష్కరించేందకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో తాగునీరు, సీసీ రోడ్లు, మురగునీటి కాలువలు వంటి సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాలలో ఘర్షణలకు దిగకుండా, సంయమనం పాటించి పోలీసులు దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలువురు గ్రామస్థులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో-2 నారాయణ, ఏపీవో రమేష్, మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను తీర్చాలి

కలకడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను తీర్చాలని తహశీల్దార్ ఫణికుమార్‌ను కలకడ పంచాయితీ కె.కొత్తపల్లె వాసులు కోరారు. శనివారం సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యతో పాటు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. స్పందించిన తహశీల్దార్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మూడు గడ్డి వాములు దగ్ధం

● సుమారు రూ.75 వేల ఆస్తి నష్టం

తంబళ్లపల్లె, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పశువుల మేత కోసం ఓ రైతు నిల్వ చేసుకున్న మూడు గడ్డి వాములు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ చేలూరివాండ్లపల్లెకు చెందిన టి.మద్దిరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ పశువులను పోషించుకుని జీవనం సాగిస్తున్నాడు. తన పొలంలో సాగు చేయగా వచ్చిన ఒక లోడు వరిగడ్డి, ఒక లోడు వేరుశెనగ కట్టె, ఒక లోడు ఉలవ గడ్డిని గ్రామ శివార్లలో పశువుల మేత కోసం నిల్వ చేసుకున్నాడు. శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాములకు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే మద్దిరెడ్డికి సమాచారం అందించి మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నించారు. మూడు గడ్డి వాములు పక్కపక్కనే ఉండటం, గడ్డి ఎండకు బాగా ఎండి ఉండటంతో ఎంత శ్రమించినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.75 వేలు విలువ చేసే మూడు గడ్డి వాములు కాలి బూడిదయ్యాయని రైతు వాపోయాడు. పశువుల మేత కోసం నిల్వ ఉంచుకున్న గడ్డి కళ్ల ముందే కాలి బూడిదవ్వడంతో రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు. ప్రభుత్వం స్పందించి బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION), PUNGANUR
I.A.No 201/2024
O.S.No: 1/2015

Shaik Naseema ... Petitioner/ Plaintiff
//Vs//
Pothu Purushotham Reddy ..Respondent/ Defendant

H-4 NOTICE

To
Pothu Purushotham Reddy, S/o P. Narayana Reddy, Real Estate Dealer #16-633-J, Ramulavari Gudi Street, Basinikonda, Near Dy.S.P. Bungalow, Madanapalle-517 325

Plase take notice that the above Petitioner/ Plaintiff has made an application to this Court that Under Sec. 151,C.P.C., to pass an order to en cash the Fixed Deposit pertaining to the deposit of 25% of the decretal amount with proportionate costs which come to Rs.1,74,089/- complied by you even before the date of Maturity enabling her to take steps for withdrawal of the same as prayed and the said proceedings are posted to 10-04-2025 at 10.30A.M., for your appearance either in person or through an advocate. Otherwise the matter will be decided exparte.

//By Order of the Court//
Punganur, Sd/- D.Venkatramaiah Chetty,
Date: 27-03-2025 Advocate for Petitioner/ Plaintiff

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION), PUNGANUR
I.A.No 202/2024
O.S.No: 118/2014

Shaik Sabjan ... Petitioner/ Plaintiff
//Vs//
Pothu Purushotham Reddy ..Respondent/ Defendant

H-4 NOTICE

To
Pothu Purushotham Reddy, S/o P. Narayana Reddy, Real Estate Dealer #16-633-J, Ramulavari Gudi Street, Basinikonda, Near Dy.S.P. Bungalow, Madanapalle-517 325

Plase take notice that the above Petitioner/ Plaintiff has made an application to this Court that Under Sec. 151,C.P.C., to pass an order to en cash the Fixed Deposit pertaining to the deposit of 25% of the decretal amount with proportionate costs which come to Rs.1,85,503/- complied by you even before the date of Maturity enabling her to take steps for withdrawal of the same as prayed and the said proceedings are posted to 10-04-2025 at 10.30A.M., for your appearance either in person or through an advocate. Otherwise the matter will be decided exparte.

//By Order of the Court//
Punganur, Sd/- D.Venkatramaiah Chetty,
Date: 27-03-2025 Advocate for Petitioner/ Plaintiff

అంబేడ్కర్ జయంతికి సెలవు ప్రకటించడం హర్షణీయం

నిమ్మనపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని కేంద్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని దళిత నాయకులు, ప్రజాసేవా సంస్థ అధ్యక్షుడు సహదేవా అన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు, అలాగే ఏప్రిల్ 14ను విద్యాదినం (ఎడ్యుకేషనల్ డే)గా ప్రకటించిన అమెరికా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యర్రయ్య, ముబారక్, సునీల్‌రెడ్డి, జయన్న, రెడ్డెప్ప, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చనలు, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను రంగురంగుల పూలతో అలంకరించారు. స్వామివారికి దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు.

బస్టాండులో చలి వేంద్రం ఏర్పాటు

గుర్రంకొండ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం గుర్రంకొండ బస్టాండులో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో ప్రతిరోజు మినరల్ వాటర్‌తో కుండలను నింపాలని ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బందికి సూచించారు. అలాగే చలివేంద్రం వద్ద పరిశుభ్రంగా ఉంచాలని వ్యాపారులకు సూచించారు.

పురం రామ్మూర్తికి ఘన సన్మానం



రామ్మూర్తిని సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

పీలేరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బీసీ నేత పురం రామ్మూర్తిని శనివారం టీడీపీ మండల శ్రేణులు ఘనంగా సన్మానించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున శాలువలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మౌలా, బుజ్జి, నౌలాక్, షమ, నాగేంద్ర, మనోహర, అతార్ చాను, పిట్టా భాస్కర రెడ్డి, కేజీఎన్ రెడ్డిబాషా, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో పారిశుధ్య పనులు

పీలేరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సామూహిక నమాజు కోసం పీలేరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ఈద్గాలో పారిశుధ్య పనులు ప్రారంభించారు. పీలేరులో రంజాన్ నమాజు సోమవారం ఉండే అవకాశం ఉండడంతో ఈద్గా మైదానంలో రూ.20 లక్షలతో సిమెంటు ఫ్లోరింగ్ పనులు పూర్తి చేశారు. ఆ పనులను శనివారం ఈవో గురుమోహన్, టీడీపీ నాయకులు లడ్డా జాఫర్, పోలిశెట్టి సురేంద్ర, కోటపల్లె శ్రీనాథరెడ్డి పరిశీలించారు.



ఈద్గాలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఈవో గురుమోహన్, టీడీపీ నేతలు